క్లుప్తంగా

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదానం చేస్తున్న క్లబ్ సభ్యులు

నిజామాబాద్‌నాగారం: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని రోటరీ క్లబ్ జిల్లా అధ్యక్షుడు పద్మశ్రీనివాస్ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ నిజామాబాద్ ఆధ్వర్యంలో గురువారం నిజామాబాద్ రెడ్‌క్రాస్ సొసైటీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. క్లబ్ ప్రతినిధులు 17 మంది రక్తదానం చేశారు. క్లబ్ సభ్యుడు కోటగిరి చంద్రశేఖర్ వంద సార్లు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఆర్ గౌరీ శంకర్, సూర్యప్రకాశ్, బి వీరబ్రహ్మం, జి రమేశ్, డాక్టర్ వినోద్ పవార్, చంద్రశేఖర్, శ్రీనివాస్, రాజశేఖర్,నేతి శేఖర్,రాంప్రసాద్ పాల్గొన్నారు.

జీపీ భవన నిర్మాణానికి భూమిపూజ


భూమి పూజ చేస్తున్న నాయకులు

సిరికొండ: మండలంలోని జగదాంబ తండాలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు కాంగ్రెస్ నాయకులు గురువారం భూమి పూజ చేశారు. ముగ్గు పోసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో రవి నాయక్, ప్రవీణ్, జనార్దన్, నరేందర్, మహిపాల్, బలరాం, శివాజీనాయక్, ప్రభాకర్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి)లో ఉన్న తెలంగాణ మైనారిటీ గురుకుల బాలుర పాఠశాల/కళాశాలలో 5, 6, 7, 8, 9వ తరగతులతో పాటు ఇంటర్ ఒకేషనల్‌లో ప్రవేశం కోసం ముస్లిం మైనారిటీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం రణవీర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. మరిన్ని వివరాలకు 9440564815, 6301242253 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న ఉత్సవాలు


అన్నదానంలో పాల్గొన్న భక్తులు

సిరికొండ: మండల కేంద్రంలో గొల్ల, కుర్మల ఆరాధ్యదైవం బీరప్ప ఆలయంలో ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద గురువారం అగ్ని గుండాలు నిర్వహించారు. భక్తులు తమ కోరికలు తీరాలని అగ్ని గుండాల్లో నడిచి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఒగ్గు కళాకారులు బీరప్ప కథను ఆలపించారు.

డాక్టర్ రాజేంద్రప్రసాద్‌కు సన్మానం


రాజేంద్రప్రసాద్‌ను సన్మానిస్తున్న సభ్యులు

నిజామాబాద్‌నాగారం: వైద్య రంగంలో విశిష్ట సేవలందిస్తున్న డాక్టర్ రాజేంద్రప్రసాద్‌కు విస్సా ఎక్స్ హెల్త్ పురస్కారం దక్కడం అభినందనీయమని చిరంజీవి యువత రాష్ట్ర కార్యదర్శి బింగి మోహన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలోని శ్రీవిష్ణు ఆస్పత్రి అధినేత డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ అందిస్తున్న ఉత్తమ వైద్య సేవలను గుర్తించిన ఓ టీవీ చానల్ విస్సా హెల్త్ ఎక్స్ పురస్కారం అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గుండ సంతోష్, శ్రీధర్, చంద్రశేఖర్, నవీన్, శంకర్, రమేశ్ పాల్గొన్నారు.

ఎల్ఐసీ మేనేజర్లకు..


రామారావును సన్మానిస్తున్న ప్రతినిధులు

సుభాష్‌నగర్: నగరంలోని ఎల్ఐసీ మెయిన్ బ్రాంచ్ మేనేజర్‌గా పి రామారావు, శాటిలైట్ ఆఫీస్ బ్రాంచ్ మేనేజర్‌గా సక్రు ఇటీవల బాధ్యతలు స్వీకరించడంతో వారిని ఏజెంట్ల సంఘం ప్రతినిధులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో మందుల దినేశ్‌కుమార్, లింగన్న, సుధాకర్, శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, దామోదర్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కిరాయింట్లో.. సర్కారు కార్యాలయాలు

- ఏళ్లు గడుస్తున్నా సొంత భవనాలు లేని వైనం
- ప్రజలకు తీవ్ర ఇక్కట్లు.. పట్టించుకోని అధికారులు


ముబారక్‌నగర్‌లోని తహసీల్ కార్యాలయం



కంఠేశ్వర్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న రూరల్ పోలీస్ స్టేషన్

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ రూరల్ మండలానికి సంబంధించిన ప్రభుత్వ కార్యాలయాలకు నిత్యం వందల సంఖ్యలో ప్రజలు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. ఎంపీడీవో, తహసీల్దార్, పోలీస్ స్టేషన్ తదితర కార్యాలయాలు జిల్లా కేంద్రంలో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఏ కార్యాలయం ఎక్కడ ఉంటుందో.. ఎన్ని రోజులు ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నిజామాబాద్ రూరల్ మండలంలో 19 గ్రామ పంచాయతీలు, నాలుగు కార్పొరేషన్ డివిజన్లు ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో వివిధ పనుల కోసం మండలంలోని మల్లారం, ధర్మారం, కొత్తపేట్ తదితర గ్రామాల ప్రజలు 10 నుంచి 15 కిలోమీటర్ల దూరం నుంచి రావాల్సి ఉంటుంది. తీరా కార్యాలయానికి వస్తే వేరే చోటికి మార్చినట్లు తెలుసుకొని ఇబ్బంది పడుతున్నారు. పాత కలెక్టరేట్ ఎదుట ఎంపీడీవో కార్యాలయం ఉండేది. అది శిథిలావస్థకు చేరిందని కూల్చేశారు. జెడ్పీ కార్యాలయం వెనుక ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో భవనం ఊరుస్తుండడంతో మళ్లీ జెడ్పీ చైర్మన్ గెస్ట్‌హౌస్‌లోకి మార్చారు. కంఠేశ్వర్‌లో నిర్మిస్తున్న రూరల్ పోలీస్ స్టేషన్ కొత్త భవనం అర్ధంతరంగా ఆగిపోవడంతో ఐదేళ్లుగా కిరాయి భవనంలోనే కొనసాగుతోంది. తహసీల్ కార్యాలయం ప్రస్తుతం ముబారక్‌నగర్ ప్రాంతంలో అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే చోట ఉండేలా, సొంత భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.


నిలిచిన పోలీస్ స్టేషన్ సొంత భవన నిర్మాణం

ఎమ్మెల్యేకు వివరించాం..

ఎంపీడీవో కార్యాలయానికి స్థలం కేటాయించాలని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డిని కోరాం. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వరలో సమస్యను పరిష్కరిస్తామన్నారు. ప్రస్తుతం జెడ్పీ చైర్మన్ గెస్ట్‌హౌస్‌లోనే ఎంపీడీవో కార్యాలయం కొనసాగుతోంది.

– రాంనారాయణ, ఎంపీడీవో

ఇబ్బందులు పడుతున్నాం

రూరల్ మండలానికి చెందిన ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రంలో ఒక్కో కార్యాలయం.. ఒక్కో చోట ఉంది. ప్రస్తుతం విద్యార్థులకు అన్ని రకాల సర్టిఫికెట్లు అవసరం ఉంటుంది. ప్రభుత్వ కార్యాలయాలకు పనినిమిత్తం రావాలంటే చాలా ఇబ్బంది అవుతోంది.

– కోర్వ రాజేంద్రప్రసాద్, ఖానాపూర్

గాండ్ల సంఘం అభివృద్ధికి కృషి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ


గాండ్ల పట్టణ సంఘం రెండో అంతస్తును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: నగరంలోని గాండ్ల పట్టణ సంఘం అభివృద్ధికి తనవంతుగా ఎల్లప్పుడూ కృషి చేస్తానని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పేర్కొన్నారు. గురువారం నగరంలోని సిర్నాపల్లిగడిలో గాండ్ల పట్టణ సంఘం రెండో అంతస్తును నుడా చైర్మన్ కేశ వేణు, సంఘం పెద్దమనుషులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందూరు గాండ్ల పట్టణ సంఘం రాష్ట్రంలో ఆదర్శంగా నిలవాలని, సభ్యులు ఐకమత్యంతో అంచెలంచెలుగా ఎదగడం అభినందనీయమన్నారు. రెండో అంతస్తుకు ఎస్‌డీఎఫ్ కింద రూ.5లక్షలు మంజూరు చేశానని, రాబోయే రోజుల్లో కూడా సంఘం అభివృద్ధికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తాను ఎమ్మెల్యేగా గెలుపొంది ఏడాదిన్నర కావస్తున్నా.. ప్రభుత్వం కనీసం ఎమ్మెల్యే నిధులు కూడా విడుదల చేయలేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి పార్టీలకతీతంగా కలిసి రావడానికి సిద్ధంగా ఉన్నానని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపుతోందని అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అర్బన్ నియోజకవర్గంపై ప్రత్యేక చొరవ తీసుకుని స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రత్నాకర్, అశోక్, నాగరాజు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నిజామాబాద్ సిటీ: రిక్షా పుల్లర్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న చేపట్టే దేశవ్యాప్త సమ్మె పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. గురువారం జిల్లా కేంద్రంలోని మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రియాజ్ మాట్లాడుతూ.. రిక్షా పుల్లర్స్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సంజు, శంకర్, అన్వర్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

నిజామాబాద్ సిటీ: కార్మికుల హక్కుల సాధనకు ఈనెల 20 నిర్వహించే దేశవ్యాప్త జాతీయ సమ్మెకు బీఎల్ఎఫ్ మద్దతు ఇస్తుందని, ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని నాయకుడు సిద్దరాములు కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీఎల్ఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సమ్మెకు మద్దతుగా తెలంగాణలోని బీడీ పరిశ్రమను బంద్ చేయాలని, తెలంగాణ బీడీ యాజమాన్యం సంఘానికి సమ్మె నోటీసు ఇచ్చినట్లు తెలిపారు.

20న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వేల్పూర్ భూమయ్య

మోపాల్: దేశవ్యాప్తంగా ఈ నెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెతోపాటు గ్రామీణ బంద్‌లో అన్ని వర్గాల ప్రజలు, కార్మికులు, కర్షకులు పాల్గొని జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు కంజర్ భూమయ్య, వేల్పూర్ భూమయ్య కోరారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని ఆరోపించారు. వ్యవసాయ రంగంలో తెచ్చిన మూడు నల్లచట్టాలు రైతు ఉద్యమ ఫలితంగా వెనక్కి తీసుకున్న రోజు రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను కేంద్రం తుంగలో తొక్కిందని విమర్శించారు. విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, రుణాలను మాఫీ చేయాలని, రైతులకు రుణ విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు అగ్గు ఎర్రన్న, ఎం నారాయణ, గంగమల్లు, చిన్నయ్య, దండు మల్లన్న, మహేశ్, గాజుల గంగారాం, దమ్మడి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ


మోపాల్‌లో విత్తనాలను పంపిణీ చేస్తున్న చైర్మన్

మోపాల్: మోపాల్ సొసైటీ పరిధిలోని రైతులకు గురువారం చైర్మన్ గ్యానాజీ గంగారెడ్డి జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. రైతులు వర్షాలు కురిసిన తర్వాతే విత్తనాలను విత్తుకోవాలని సూచించారు. పంట భూమి సారవంతం కోసం రైతులు జీలుగను వాడాలన్నారు. జీలుగ విత్తనాలు కావాల్సిన రైతుల పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్సులు తీసుకు రావాలని పేర్కొన్నారు. 30 కిలోల బస్తా రూ.2140 అని, ఒక బస్తా రెండున్నర ఎకరాలకు విత్తుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామేశ్వర్, ఏవో సౌమ్య, సొసైటీ డైరెక్టర్ నరేందర్, సీఈవో సాయిచంద్, రైతులు ఉదయ్, గోపి, ఏఈవోలు పాల్గొన్నారు.

డిచ్‌పల్లిలో..

డిచ్‌పల్లి: మండలంలో డిచ్‌పల్లి సొసైటీ పరిధిలో, బర్దిపూర్ సొసైటీ పరిధిలో శుక్రవారం సబ్సిడీపై జీలుగ విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ ఇన్‌చార్జి అధికారి శ్రీకాంత్ తెలిపారు. రైతులు పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డ్ జిరాక్స్‌లను తీసుకు రావాలన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇందల్వాయిలో..

ఇందల్వాయి: ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న జీలుగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఇందల్వాయి, నల్లవెల్లి సొసైటీ పరిధిల్లో శుక్రవారం పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్‌బుక్ జిరాక్సులతో సొసైటీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు మార్కింగ్


ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుతో అధికారులు

డిచ్‌పల్లి: అర్హులైన లబ్ధిదారులు త్వరగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించుకోవాలని డిచ్‌పల్లి మండల ప్రత్యేకాధికారి పల్నాటి యోహాన్ సూచించారు. గురువారం ఎంపీడీవో లింగం నాయక్ తో కలిసి మండలంలోని కమలాపూర్‌లో నాలుగు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు మార్కింగ్ చేశారు. అనంతరం జీపీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించారు. లబ్ధిదారులు ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం ఇంటి నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, గ్రామ ప్రత్యేకాధికారి శ్రీకాంత్, హౌసింగ్ ఏఈ అన్నపూర్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాలసాని శ్రీనివాస్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రతాల పంపిణీ

నిజామాబాద్ రూరల్: మండలంలోని మల్లారం గ్రామంలో 39 మందికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను జీపీ కార్యదర్శి శ్వేత గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు జవాజీ రమేశ్, పిట్ల నెహ్రూ, కొండా శ్రీనివాస్, గస్కంటి లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎల్లమ్మగుట్టలో పర్యటించిన నుడా చైర్మన్


బ్రిడ్జిని పరిశీలిస్తున్న నుడా చైర్మన్ కేశ వేణు

నిజామాబాద్ సిటీ: నగరంలోని ఎల్లమ్మగుట్ట కాలనీలో నుడా చైర్మన్ కేశ వేణు గురువారం పర్యటించారు. అమ్మ వెంచర్‌లో నూతనంగా నిర్మించిన బ్రిడ్జిని పరిశీలించారు. త్వరలోనే బ్రిడ్జిని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. స్థానికులు పలు సమస్యలను నుడా చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట పంచరెడ్డి సూరి, కొండపాక రాజేశ్, పురుషోత్తం, గోపరి లక్ష్మణ్, సంతోష్ కుమార్, యెండల కిషన్ తదితరులు ఉన్నారు.

సేంద్రియ ఎరువుగా ఆవు పేడ

- జీవామృతంగా గోమూత్రం
- భూముల్లో పెరగనున్న సారం


పంట భూమిలో కట్టేసిన ఆవులు

సిరికొండ: రసాయన ఎరువుల వాడకంతో భూములు సారం కోల్పోతుండటంతో అన్నదాతలు సేంద్రియం వైపు మొగ్గు చూపుతున్నారు. పంట భూముల్లో భూసారం పెంచడానికి లాగుబడిగా ఆవుల, కోళ్ల పేడను వినియోగిస్తున్నారు. పంట భూముల్లో ఆవుల మందలను కట్టేస్తున్నారు. ఆవులను అక్కడే పడుకోబెట్టడం వల్ల వాటి మూత్రం, పేడ సేంద్రియ ఎరువుగా చాలా ఫలితం ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. గత కొన్నేళ్లుగా రైతులు పూర్తిగా రసాయన ఎరువులు వినియోగిస్తూనే పంటలను సాగు చేస్తున్నారు. దీంతో నేలలు నిస్సారంగా మారుతున్నాయి. చీడపీడల నివారణకు విపరీతంగా రసాయన మందులను పిచికారీ చేస్తున్నారు. పంటల సాగుకు రసాయన ఎరువులను మోతాదుకు మించి వేస్తున్నారు. దీంతో నేలల్లో భాస్వరం లాంటి రసాయనాలు పేరుకుపోతున్నాయి. రసాయన ఎరువుల వాడకం వల్ల భూములు సహజ గుణం కోల్పోతాయి. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గిస్తు సేంద్రియ ఎరువులు, పచ్చి రొట్ట ఎరువులు వినియోగిస్తేనే భూములు సారవంతంగా మారుతాయని, లేకుంటే రానున్న రోజుల్లో నేలల్లో పంట దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ఆవులకు ఆహారంగా పశుగ్రాసం

పంట కోతలు పూర్తయిన అనంతరం వచ్చే పశుగ్రాసాన్ని తగలబెట్టకుండా ఉంచాలి. ఆవుల మందలను పంట భూముల్లో కట్టేస్తున్నప్పుడు ఆ పశుగ్రాసం ఆవులకు ఆహారంగా ఉపయోగపడుతుంది. ఆవులకు పశుగ్రాసం విరివిగా లభించడంతో పేడ కూడా అధిక మోతాదులో విసర్జిస్తాయి. ఆవులు పేడ ఎక్కువగా వేయడం వల్ల భూమిలో పోషకాలు పెరుగుతాయి. భూమిలో పోషకాలు పెరగడంతో పంట దిగుబడి పెరగడంతో పాటు పంటలకు చీడపీడల బాధ, తెగుళ్ల వ్యాప్తి తగ్గుతుంది. ఆవు మూత్రంలో పోషకాలు మెండుగా ఉంటాయి. ఆవు మూత్రం వల్ల కూడా భూముల్లో సారం పెరుగుతుంది.

భూసారం పెరుగుతుంది



పంట భూముల్లో ఆవులను కట్టేయడం వల్ల భూసారం పెరుగుతుంది. సేంద్రియ ఎరువుల వాడకంతో భూములు గుల్లబారి పొరలు పొరలుగా మారతాయి. సేంద్రియ కర్బనం పెరగడంతో పాటు నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. పంటలకు పోషకాలు బాగా లభిస్తాయి. ఆవు మూత్రం జీవామృతంగా పని చేస్తుంది. భూములను కాపాడుకోడానికి రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలి. సేంద్రియ ఎరువుల వాడకం వైపు రైతులు మొగ్గు చూపాలి.

– నర్సయ్య, మండల వ్యవసాయ శాఖ అధికారి

నేడు రాంపూర్‌లో క్రికెట్ టోర్నమెంట్

డిచ్‌పల్లి: మండలంలోని రాంపూర్‌లో శుక్రవారం జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించనున్నట్లు రాంపూర్ యూత్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు గురువారం తెలిపారు. వీడీసీ సహకారంతో టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని, విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు సందీప్, దాసు, శ్రీకాంత్, శ్రీను తదితరులు పేర్కొన్నారు.

మురళీనాయక్‌కు ఘన నివాళి



నిజామాబాద్ రూరల్: పాకిస్తాన్ దేశంతో జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన మురళీనాయక్‌కు ఇందూరు ప్రజాసేవ సభ్యులు ఘన నివాళులు అర్పించారు. నగరంలోని దేవిరోడ్డులో ఉన్న భగత్ సింగ్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నివాళులు అర్పించి దేశం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కోడూరి పోశెట్టి, ప్రసాద్, రవి, గోవింద చారి తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)
- స్క్రీన్-1 లెవన్(తెలుగు-2డీ)-11.00, 4.40
- హిట్(తెలుగు)-1.30, 7.20
- స్క్రీన్-2 సింగిల్(తెలుగు)-11.00, 1.30, 4.30, 7.30, 10.30
- స్క్రీన్-3 లెవన్(తెలుగు2డీ)-7.30, 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
- స్క్రీన్-1 సింగిల్(తెలుగు)-11.30, 2.15, 7.55,10.40
- లెవన్(తెలుగు)-5.00
- స్క్రీన్-2 డెవిల్స్ డబుల్ నెక్ట్స్ లెవెల్(తెలుగు)-11.55, 8.00, 10.50
- లవ్‌లీ-(3డీ తెలుగు)-2.45
- సింగిల్(తెలుగు)-5.15
- స్క్రీన్-3 లెవన్(తెలుగు)-11.40
- శుభం(తెలుగు)-2.35, 8.05 -23(తెలుగు)-5.15
- ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్(ఇంగ్లిష్)-10.45
- స్క్రీన్ -4 ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్(తెలుగు)-11.20, 1.50, 7.35
- హిట్(తెలుగు)-4.20, 10.05

లలితామహల్ లెవన్(తెలుగు) దేవి సింగిల్
నటరాజ్ జగదేకవీరుడు అతిలోకసుందరి
విజయ్ హిట్

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	95,200	వెండి(కిలో)	1,00,000
22 క్యారెట్స్	87,875		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	15	గాజరుగడ్డ	30	60
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	30	50
బీరకాయ	40	60	దోసకాయ	20	40
దొండకాయ	25	40	ఆలుగడ్డ	25	50
బీర్నిసుకాయ	100	150	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	30	50
వంకాయ	30	50	బీట్‌రూట్	25	50
పాలకూర	20	40	కరివేపాకు	40	60
మెంతికూర	60	90	చామగడ్డ	40	60
కొత్తిమీర	50	80	గోరుచిక్కుడు	40	60
పుదీనా	50	80	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	40	80	మామిడికాయ	30	50

–సుభాష్‌నగర్

బాధిత కుటుంబానికి సిఫారసు లేఖ అందజేత


సిఫారసు లేఖను అందజేస్తున్న ఎమ్మెల్యే

మోపాల్: మండలంలోని వెంకట్రాం తండాకు చెందిన బనావత్ రాములు తలకు ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స కోసం రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి సిఫారసు లేఖను గురువారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. రాములు ఆర్థికంగా వెనకబడి ఉండటంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి డబ్బులు ఇప్పించడానికి సిఫారసు లేఖను బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే అందించి ధైర్యానిచ్చారు. సిఫారసు లేఖను అందించిన ఎమ్మెల్యే భూపతిరెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.